# అమ్మ మంచితనం



వి. జయశ్రీ సంజీవి

అంతవరకూ వాళ్ళిద్దరూ కలిసే వచ్చారు.

పద్మ పరుగు పరుగున ఇంట్లోకి ప్రవేశించింది. అయితే గుమ్మం దిగువనే సుగుణమణి నిల్చుండిపోయింది; బిడియ పడుతూ.

"రావే.... సుగుణా! మా అమ్మ చాలా మంచిదని చెప్పానుకదూ....! రా లోపలికి..." అంది వెనక్కి తిరిగి చూసిన పద్మ చనువుగా.

"ఊహూ....ఇంకోమాటు ఎప్పుడేనా వస్తాను. నాకు ఏవిటోగా వుంది.... ఇప్పుడు కాదులే; ఇంకోమాటు.... తప్పకుండా" అంటూ నసిగింది సుగుణ.

"ఇదుగో....! నేను ముందే చెప్పా నమ్మాయ్. మా ఇంట్లో ఇటువంటి సిగ్గులూ, భయాలూ పనికిరావని. తీరా వచ్చాక ఇదేఁవిటి....? పెద్ద గొప్పగా బయల్దేరి ముందు...."

"నేను బయల్దేరానా....? నువ్వు కదూ లాక్కొచ్చావ్ నన్ను....??"

"సరే.... నేనే లాక్కొచ్చాను నిన్ను ఇక్కడివరకూ.... పద ఇంట్లో కూడా లాక్కెడతాను. మా ఇంట్లో ఎవరూ లేరు, మా అమ్మగారు తప్ప. ఆమె చాలా మంచిది. ఒక్కసారి ఆమెతో మాట్లాడావంటే రోజూ నేను పిలవకుండానే పరుగెత్తుకొస్తావు. అంత బాగా మాట్లాడుతుంది మా అమ్మ. రా లోపలికి...." అంది ఆదరంగా. సుగుణ

కొత్త మెత్తబడింది. చుట్టూరా బెరుగ్గా చూస్తూ నెమ్మదిగా లోపల ప్రవేశించింది.

— అది 'ఇల్లు' అనేకన్నా ఒక గది అనడం న్యాయం. సరిగ్గా కొలిస్తే మామూలు గది అంత విశాలంగా కూడా వుండదు. అందులోనే 'పార్టిషన్' మాదిరి వేరుచేస్తూ ఒక నీలపు తెర వేళ్లాడుతోంది. తెర వెనుక ఏముందో కన్పించనంత మందంగావుందా బట్ట. లోపల్నించి ప్లాస్టిక్ వైర్‌తో అల్లిన పాత కుర్చీ ఒకటి తెచ్చి వేస్తూ సుగుణను కూర్చోమని చెప్పి తెరమరుగయింది పద్మ.

కుర్చీలో కూర్చుంటూ తమ ఇంటి హంగునీ, శోభనూ గుర్తుచేసుకోసాగింది సుగుణ. అది చాలా పెద్ద ఇల్లు. అక్కడ సినిమాల్లో మాదిరే రంగు రంగుల ఫర్నిచరూ, పెద్ద పెద్ద సోఫాలూ, మంచాలూ వున్నాయి. బెడ్ రూమూ, డ్రాయింగ్ రూమూ, గెస్ట్ రూమూ, కిచెనూ అంటూ బోలెడు గదులున్నాయి.


ఇన్నివున్నా ఏదో వెలితిగా అన్పించే వాతావరణం అది. తనకు ఏ మాత్రం సంతృప్తి నివ్వలేని సౌకర్యాలు అవన్నీ. 'మరి పద్మ ఇంత చిన్న ఇంటిలో ఇంత ఇరుకు పరిసరంలో ఎంత చలాకీగా, వుత్సాహంగా వుండగలుగుతోంది?' సుగుణకు ఆశ్చర్యంగా వుంది.

— ఈ కొత్త అతిథిని చూడగోరి పెరట్లో ఏదో పని ముమ్మరంలోంచి బయటపడి హడావిడిగా వచ్చిన శారదమ్మ సుగుణమణిని చూస్తూనే క్షణంపాటు మూగవోయింది.

విలువైన టెర్లిన్ దుస్తుల్లో మంచి ముత్యంలా ధగధగలాడుతున్న సుగుణ పాత కుర్చీలో ఏదో శిక్ష ననుభవిస్తున్నట్టే కూరుకుపోయి కూర్చోవడం ఆమెకు బాధ అన్పించింది.

సుగుణమణి కొంచెం కొత్త ఫీలవుతూ - ధైర్యంగానే.... "రోజూ మీ ఇంటికి రావాలనుకుంటూండేదాన్ని. ఇవ్వాళ కుదిరింది.... మీ పద్మకూ నాకూ స్నేహం. అందుకని.... మీరు చాలా మంచివారట.... పద్మే చెప్పింది.... కానీ.... మా అమ్మ మంచిది కాదండీ!" అంది ముగింపుగా. శారదమ్మ అదిరి పడింది. ఆమె గుండె దడ చాలాసేపటి వరకూ తగ్గలేదు. సుగుణ దీనంగా చూస్తూ ఆమె మాట కోసమై ఎదురు చూస్తోంది.

"...తప్పమ్మా.... అలా అన కూడదు. అమ్మలు అందరూ మంచి వాళ్ళే.... మంచిది కాకపోవడ మేఁవిటీ మీ అమ్మ....? పిచ్చిదానివి కాకపోతే." ఆ పిల్ల ఉద్దేశం ఏఁవిటో.... ఎందుకని ఆ విధంగా అంత తేలిగ్గా ఆ మాట అనగల్గిందో, ఇంత ఐశ్వర్యం మధ్య బతుకుతూ కూడా తన తల్లి ఎడల సద్భావం లేకపోవడానికి గల కారణం




ఏవిటో....శారద సొంతంగా ఊహించ లేకపోయింది.

—సుగుణమణి తండ్రి గవర్న మెంటులో ఒక బాధ్యతాయుతమైన పదవిలో వున్న వ్యక్తి. ఆయా ఉద్యోగస్థులకు గ్రేడుల వారీగా కట్టించిన క్వార్టర్సులో 'ఎ' వైపు బిల్డింగులో వుంటున్నారు వాళ్ళు.

ఆ క్వార్టర్సులోని పిల్లలంతా మిగతా వారి తల్లిదండ్రులను 'ఆంటీ' 'అంకుల్' అంటూ పిలుస్తుంటారు. సుగుణ చనువుగా ఎవరింటికి వెళ్ళి 'ఆంటీ....!' అని పిలిచినా వాళ్ళందరూ "రారా! సుగుణమ్మా....! పిచ్చితల్లి.... కాఫీ తాగావా? ఇచ్చిందా మీ అమ్మ....? టిఫిను అదీ పెట్టిందా....? ఎంత పెట్టిందీ....?? అయ్యో! పిచ్చిమొహమా! ఏదో లే పాపం...." అంటూ ఈ విధంగా పరామర్శలకు దిగేవాళ్ళు.

ఊహ తెలిసిన దగ్గర్నించీ ప్రత్యేకంగా తన గురించిన ఈ సానుభూతి పదాలు వింటూ 'పిచ్చితల్లీ, పిచ్చి మొహమా....!' అంటూ తనను ఎగదోస్తూ ఇంటి గుట్టంతా లాక్కునే ఆంటీ లంటేనే అదో విధమైన అభిమానాన్ని పెంచుకుంది సుగుణ.

—ఈరోజున శారదమ్మ కూడా అదే విధంగా...."పిచ్చిదానివి కాకపోతే...." అనేసరికి సుగుణకు ఎక్కడలేని ఆత్మీయతా ముంచుకొచ్చింది శారదపట్ల. అందుకే తకీమవి చెప్పేసింది.

"మా అమ్మ సొంత అమ్మ కాదండీ —'సవిత్తల్లి'" అని.

శారద దిగ్భ్రమగా చూసింది సుగుణ

వేపు. ఒక పట్టాన ఆమె సర్దుకోలేక పోయింది. సుగుణ ఆమె నోటిమీదుగా ఎంతో సహానుభూతినీ, ఊరడింపునూ కోరి విరాళచెందింది.

శారద కాఫీ కలుపుకొస్తాననే నెపంతో మౌనంగా లోపలికి వెళ్ళింది.

—ఈ లోగా పెరట్లో తల్లి వదిలేసి వచ్చిన పని పూర్తిచేసుకువచ్చిన పద్మ సుగుణను కలిసి—"చూశావా .... మా అమ్మనూ....?" అంటూ ప్రశ్నించింది.

సుగుణ ఏ మాత్రమూ ఉత్సాహం కనబర్చలేదు.

"మా అమ్మ అంటే నాకు చాలా ఇష్టం...." అంది పద్మ మళ్ళీ.

"అవును— నా స్నేహితులు.... రమణి, రంగ, బుజ్జి, సురేషు, మల్లి, అందరూ వాళ్ళ వాళ్ళ అమ్మలంటే ఇష్ట పడతారు...."

"మరి.... నువ్వో....??"

"నా కిష్టంలేదు—!"

"ఎందుకని....? (అమ్మంటే ఇష్టం లేని వాళ్ళుంటారా) అన్నట్టు అడిగింది.

"ఆమె మా సొంత అమ్మ కాదు - మారుటి అమ్మ. అందుకని...."

"అయితేనేం....? అమ్మ స్థానంలో వచ్చాక ఆమెనే అమ్మగా చూడాలి-"

"మనం చూసినా....వాళ్ళు చూడరుగా మనల్ని."

"ఎందుకు చూడరు....?"

"చూడరట-సుమిత్ర ఆంటీ చెప్పింది. మా నాన్న చేస్తున్న ఉద్యోగం అదీ చూసి.... పెద్ద జీతం, బోలెడు హోదా, బాగా బ్రతకవచ్చని మా కొత్త అమ్మ అతన్ని పెళ్ళిచేసుకుందిట. నేనంటే వాళ్ళకు అపేక్ష వుండదట. నేను వాళ్ళకి ఎంతో ఆటంకంగా వుంటానట—"

సుగుణ కళ్ళు అదోలా తిప్పుతూ బట్టీ పెట్టినట్టే ఒప్పజెప్పింది. పద్మ ఆలోచనలో పడింది.

ఈ లోగా శారద రెండు స్టీలు గ్లాసుల్లో వేడివేడి కాఫీలు నింపుకుని నిశ్శబ్దంగా కూచున్న వారివద్దకు వచ్చింది

నీలితెర బదులు అడ్డుగోడ ఉన్నట్టయితే వీరి మౌనానికి కారణం ఆమె అడగాల్సి వచ్చేది. నేపథ్యంలోంచి ఆమె వీరి సంభాషణ క్షుణ్ణంగా వింది. విషయం చాలావరకు బోధపర్చుకుంది.

ఇహ ఈ ప్రసంగాన్ని అట్టే పొడిగించడానికి ఆమె మనసు అంగీకరించలేదు. అందుకే ధోరణి మార్చే ఉద్దేశంతో ....

"చూడు సుగుణా! స్కూలునించి రాగానే స్నానం చేసేసి, తల దువ్వుకుని పువ్వులా తయారయి వచ్చావు; నిన్ను చూస్తుంటే నీ పేరుకి తగినట్టుగా వున్నావనిపిస్తోంది సుమా....!" అంది అనునయంగా.

"— అవునండీ ....! ఇదొక తల నొప్పి నాకు; రాంగానే వేణ్ణీళ్ళు తొలిచి సిద్ధం చేస్తుంది. విధిగా రెండు పూట్లా

స్నానం చేయాల్సిందే. 'ఒకపూట బద్ధకిస్తే ఆవిడకే మంచిది కదా....బట్ట లుతకడం తప్పుతుందీ–' అనుకుంటాను. ఊహూఁ....ఒప్పుకోదే."

చేతుల్తో ఏక్షనుచేస్తూ అరిందాలా చెబుతోంది సుగుణ.

శారదమ్మ మళ్ళీ ఆలోచనల్లో కొట్టుకో సాగింది.

సుగుణవేపు జాలిగా చూస్తూ నవ్వ డానికి ప్రయత్నం చేసింది.

"ఈ జడలు చూశారా....పొద్దుటా, సాయంత్రం దువ్వి అల్లవలసిందే. నా జుత్తు అసలే ఒత్తు అట....దువ్వకపోతే పేలు పడతాయట....పేలు .... రూన్సీ ఆంటీ ఏమందో తెలుసా....? 'దువ్వీ దువ్వీ జుత్తంతా రాలగొడితే గాని ఆవిడకి నిద్రపట్టదు గామోసు; అయ్యో అలా జడలు బిగ్గట్టిపెడితే మెడలు నొప్పిపెట్టవూ."

"బిడ్డ పోషణలో చాలా శ్రద్ధమ్మా..." అంటూ అందరూ మెచ్చుకోవాలని తాపత్రయం కాకపోతే మా పిన్నికి...." అంటూ నా గురించి ఎంతో బాధపడింది.

"రూన్సీ అంటే ఎవరమ్మా....!?"

"రూన్సీ ఆంటీవాళ్ళు మన ఎదు రింట్లో వుంటారులెండి. నేనంటే చాలా ప్రేమ. నా ఆలనాపాలనా వాళ్ళే చూస్తా రండీ."

"అంటే అన్నాలూ, అప్పచ్చులూ అవీ పెడుతుంటారా నీకు....?"

"ఛ....! అలాంటివి ఎక్కడైనా ఏమైనా తిన్నానని తెలిస్తే మా అమ్మ ఊరుకోదు. కొట్టినంత పని చేస్తుంది."

"మరి ఆలనాపాలనా .... అంటే" శారదమ్మ కుతూహలాన్ని అణచుకో లేకపోతోంది.

"—అంటే....నేను ఏపూట ఏం తింటోందీ, ఎంతెంత తినేదీ, నాకు కుట్టించే బట్టలూ, వాటి ఖరీదులూ.... నన్ను మా అమ్మ ఎప్పుడేనా కొడితే.... దానికి కారణాలూ...ఇవన్నీ అడిగి అడిగి నాచేత చెప్పించుకుంటారు. మళ్ళీనేమో మా పక్కింటి విశాలాంటీ ఇంకా అవుతలి వీధిలోంచి కూడా చాలామంది ఆంటీలు అంతా ఒకచోట చేరి మాఅమ్మ గురించి రక రకాలుగా ప్రశ్నలువేస్తూ... నన్ను మధ్య మధ్య ఊరడిస్తుంటారు.

—వాళ్ళంతా ఇలా అడుగుతున్నట్టు మా అమ్మతో చెప్పగూడదన్నారు. చెబితే ఈ మాత్రం బయటికూడా రానివ్వ కుండా కట్టడిచేసే ప్రమాదముందట."

గోడ పక్కగావున్న కిటికీ చువ్వలు పట్టుకు నిలబడివున్న పద్మ అతి శ్రద్ధగా ఈ పిల్ల చెప్పే ఖబుర్లు వినడాన్ని గమనించింది శారద.

ఇంతగా కౌతుకాన్ని రేకెత్తించే ఇటువంటి ముచ్చటివి....'వినకూడదు – లోపలికి పో' – అని చెప్పలేకపోయింది. ఆమె గుండెల్లో సన్నని కోత ప్రారంభ మైంది.

"కాఫీ చల్లారిపోతోంది. తాగు" మని హెచ్చరించి సుగుణ ఒక్కో గుక్కా ఆర్పుకుంటూ తాగుతుంటే ఆ మె నే వింతగా చూస్తూ నిలబడింది. కాఫీ పూర్తయ్యే వరకూ సుగుణ నోరు విప్పనేలేదు.

తాగింతర్వాత, "మీ పద్మను పంపించండి నాతో .... కాస్సేపు ఆడుకుని వస్తుంది...." అంటూ అడిగింది.

"వద్దులేమ్మా....నా క్కొంచెం పని సాయం చేయాలి. ఇప్పటికే ఆలస్యం అయింది...." అంటూ అడ్డు చెప్పింది శారద.

సుగుణ ఏమనుకుందో ఏమో, "వెళ్తానండీ!" అంటూ దిగ్గున లేచి వెళ్ళిపోయింది.

* * *

శారద అతి గంభీరంగా ప ను లు చూసుకుంటోంది.

'సవిత్తల్లి....సవిత్తల్లి ....!' అనుకుంది పద్మ గొణుగుతున్నట్టే. అమ్మ చచ్చిపోతే నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకోడం అనేది ఆ క్షణాన ఆమెకు చాలా వెగటుగా క్రూరంగా కన్పించింది. అలాగే నాన్న చచ్చిపోతే అమ్మ ఎందుకు మళ్ళీ పెళ్ళిచేసుకోదు....?

చేసుకుంటారా ఎక్కడైనా .... ?? ఏమో మరి .... మా అమ్మ మాత్రం నాన్న చచ్చిపోయినప్పటికీ పెళ్ళి చేసుకోలేదు. చేసుకోదు కూడా.

అమ్మకి ఏమీ అఖ్ఖరలేదు. నేనుంటే చాలు. నేనే ఆమె సర్వస్వం....నన్ను తీర్చిదిద్దడమే ఆమె ధ్యేయం-అందుకే మా అమ్మ అంటే నాకు ప్రాణం-అనుకుంది.

చకచకా వంట చేస్తున్న తల్లికి అ డ గ కుం డా నే అన్నీ అందించింది. ఆమె....నిర్వికారంగా యాంత్రికంగా పనిచేస్తూనే వుంది. అప్పుడప్పుడూ ఆమె ఇదే విధంగా కొయ్యగట్టుకుపోయినట్టు మౌనం వహించడం పద్మకు అనుభవమే. అటువంటి సమయాల్లో అనవసర ప్రసంగాలు తెచ్చి తల్లిని విసిగించకూడదని సుశిక్షితమైన పద్మ నేర్చుకుంది.

"నేనింక చదువుకుంటానమ్మా...." అంటూ సమాధానం ఆశించకుండానే తెర తొలగించుకుని ఇవతలకి తప్పుకుంది.

శారదమ్మను నిలువునా సుగుణమణి రూపమే ఆవహించింది. ఆ పిల్ల మాటాడిన మాటలే గది గోడల్లోంచి ప్రతిధ్వనిస్తున్నట్టయింది.

'మా అమ్మ మంచిది కాదండీ....!'

వాడియైన బా ణం లాం టి ఆ వాక్యాన్ని ఎంత సునాయాసంగా వదిలేసింది....? ఆ వదలడంలో ఏదో నిర్లక్ష్యం తొంగిచూసింది. తల్లి ఎడల అటువంటి భావం సుగుణ స్వయంగా ఏర్పరచుకున్నది కాదని స్పష్టంగా తేలిపోయింది.

సుగుణతల్లి సవతి బిడ్డ సంరక్షణలో ఆమె కనబరచే శ్రద్ధాసక్తులే చాటి చెబుతున్నాయి; నిష్కల్మషమైన ఆమె మాతృహృదయానికి విదర్శనంగా ఎవరో సుమిత్ర అట- అమాయిక హృదయాన్ని మలినపరుస్తూ ఉద్యోగం ఆస్తీ, హోదా, ఇవన్నీ చూసి బాగా బ్రతకవచ్చని అతన్ని చేసుకుంది-' అంటూ నూరి పోసిందట.

ఎంత దారుణం....?!

స్త్రీకి స్త్రీయే శత్రువంటారు. ఏ విషయమైనా అనుభవంలోకి వస్తేగాని అర్థమయిచావదు. అసలు రెండవ పెళ్ళి వాణ్ణి చేసుకోడం, అందునా ఒకటే ఆడ పిల్లున్న వాణ్ణి కట్టుకోడమే ఒక శాపం. యౌవనపు తొలి అనుభవాల నన్నింటినీ తొలిభార్యతోనే సమాధిచేసి, కేవలం మనుగడకోసం, జీవన పోరాటంలో సమవుజ్జీగా నిలబెట్టేందుకు మాత్రమే ద్వితీయానికి తలపడే భర్తలు కొందరైతే....వొండిపొయ్యడానికీ, తల్లి చావు బిడ్డల్ని సాకడానికీ తెగింపుతో పీటలమీద కూచునేవారు మరికొందరు. ఆ సంసారం కూడా లాంఛనప్రాయం గానే కొనసాగుతుంది.

సహజంగా తొలివివాహంలో ద్యోతక మయే రక్తీ, అనురక్తీ ఈ మలివివాహ దశలో అగుపించవు. ఎక్కడయినా రెండో పెళ్ళి అనేది విజయాన్ని సాధించి నప్పటికీ మరణించిన భార్య తాలూకు బిడ్డలు వీరి అన్యోన్యానికి అవరోధాలుగా అన్పించే ఘట్టాలు అనేకం.

—అయితే అది కేవలం అక్కడి సామాజిక వాతావరణాన్నిబట్టి రూపు దిద్దుకొంటుంది.సుమిత్ర, ఝాన్సీ, విశాల మొదలుగాగల ఆంటీలంతా ఇక్కడి సంఘంలో సభ్యులు.

ఈ సవతితల్లిపై వీళ్ళంతా కలిసి మంచిదికాదనే ముద్ర గుద్దేశారు. ఆ స్టాంపుని బలపరుస్తూ....రెండు పూట్లా స్నానం చేయించడం, తల దువ్వడం, పరిశుభ్రంగా వుంచడం కూడా నేరాలే నంటూ సుగుణలాంటి అజ్ఞాన బాలిక యొక్క ఆమోదముద్రను సంపాదించ గల్గారు.

'ఆస్తీ, హోదా వున్నంత మాత్రాన అందరూ రెండో పెళ్ళివాణ్ణి కట్టుకో గలరా....? అసలు సుగుణ తల్లి అతణ్ని చేసుకోడానికి కారణం బాగా బ్రతకవచ్చనే ఆశ ఒక్కటేనా....? ఏ పరిస్థితులవల్ల ఒక కన్నెపిల్ల మారు మనువుకి సిద్ధపడిందో వీళ్ళు అర్థంచేసు కోడానికి ప్రయత్నించరా....? సుగుణతల్లి పట్ల శారద హృదయం కారుణ్యంతో పూడుకుపోయింది.

ఆమెను గురించి ఇంకా తెలుసుకునే అవకాశం లభిస్తే....

సుగుణ మళ్ళీ ఎప్పుడొస్తుందో....!

— శారద మడతమంచంమీదికి వాలి దిండు దగ్గరికి లాక్కుంది. తన

వివాహం .... అంతలోనే హఠాత్తుగా అతను పోవడం....అతని గుర్తుగా అదే ముక్కు, నడక, అలవాట్లతో పద్మ మిగలడం – చివరికి ఆమెకు అంతే దక్కింది.

అప్పట్లో ఈ పెళ్లి జరిగితీరాలన్నాడు తండ్రి. ఇంతకన్నా మంచి సంబంధం తేలేనన్నాడు అన్నయ్య. కట్నాలు.... కట్నాలు .... ఎవరు చూసినా కట్న మెంతిస్తారు....? అని అడిగినవాళ్ళే. ఏపూటాకాపూట కొలుచుకుని తినేవాళ్ళు కట్నా లెక్కణ్ణించి తెచ్చిపోస్తారు....?

అతను వచ్చి పిల్లను చూస్తానన్నాడు.

ఉన్నంతలో ముస్తాబుచేసి అతని ఎదురుగా తెచ్చి కూచోబెట్టారు పెద్దలు. సెకన్లు నిముషాలుగా మారినయి. అంతే. అంత స్వల్ప వ్యవధిలో అతను ఏం చూశాడో మరి....లేచి నిలుచున్నాడు. వెళ్ళడానికి ఉద్యుక్తుడైనాడు. తండ్రీ, అన్నయ్యా అతన్ని అనుసరిస్తూ వాకిట వరకూ నడిచారు.

తటాలున గుమ్మంలో నిలబడినవాడు వెనక్కి తిరిగి అక్కడే శిలాప్రతిమలా కూచున్న ఆమెను క్షణంలో సగంసేపు పరికించి...."శారదను వివాహం చేసు కోడం నాకిష్టమే....ఆమె ఇష్టాన్ని కూడా తెలుసుకోవాల్సివుంది," అన్నాడు.

ఆమె తండ్రికి గుర్రమెక్కినంత హుషారు వచ్చింది.

"శారదా....! వింటున్నావా ....??" అంటూ పిలిచాడు కాదు. అరిచాడు. అంతే ఆ శారద తల భూమిలోకి కూరుకు పోయింది.

చాలా హడావిడిగా జరిగిపోయింది ఆ పెళ్ళి.

అంత హడావిడిగానూ అన్నీ అయి పోయినయి. ఈ దిండు ఒకప్పుడు తమ యిద్దరి తలలూ భరించి రెండు గొయ్యి లుగా అణిగిపోయిన ఈ దిండు ఇప్పుడు ఒక పక్కనే గోతిని చూపెడుతోంది. అందుకే ఆవైపు చామంతులూ, మరువం కలిసిన వాసన వేస్తోంది. పువ్వులంటే అతని కెంతో యిష్టం!

రోజూ సాయంత్రం పూట పూల కుర్రాడు తమ వాకిటముందు హాజరయే వాడు. పువ్వులతో నిండిన తన తలను ఆప్యాయంగా గుండెలకు దగ్గరగా చేర్చుకుని ఆ వంకన తన చెంపల్ని ముద్దాడేవాడు. తామిద్దరూ ఎంత అన్యో న్యంగా ఉండేవారో....!! మగపిల్లలంటే అతని కెంతో ఇష్టం. అతను ఇంకో ఆరు మాసాలకు పోతాడనగా కాబోలు ....తమకి కొంచెం దూరపు బంధువూ, ఆత్మీయురాలైన 'సూరమ్మత్త' ఒకరోజు దగ్గరకు పిలిచి అతి రహస్యంగా.... "నీళ్ళోసుకున్నావే పిల్లా...." అంటూ అడిగింది.

"ఉహూఁ...." అంటూ సిగ్గుపడ్తూనే తల అడ్డంగా వూపింది ఈ శారద.



"కాస్తంత ఒళ్లు చేసినట్టు కన్పిస్తేనూ ....అనుమానమొచ్చిందిలే. సాయంత్రం దిష్టితీసిపారేస్తానుండు - అయినా రోజూ వడిచేతావున గడ్డి మొలవదమ్మా" అంటూ అర్థయుక్తంగా నవ్వింది

అచ్చంగా అతని ఇష్టాలే పద్మవి కూడా.

రోజూ పువ్వులు కొనమని పేచీ. వాటిని జడలో అలంకరించబోయే ముందు ఆ 'ముక్కు'తో అతనికి మల్లే నే కళ్ళు సగం మూసి వాసన పీలుస్తూ తన్మయం చెందుతుంది.

"పిచ్చి పద్మ....ఆడపిల్ల అయింది గానీ, మగపిల్లవా డైనట్టైతే...." అని మురిసిపోయేవాడు అతను.

'ఏ పిల్లో ఒహ పిల్ల ....దురదృష్ట వంతురాలు' అన్పించి గాఢంగా నిట్టూర్చింది శారద.

భర్త పోయాక ఆ ఊళ్ళో ఆ పరిసరాల్లో బ్రతకడం దుర్భరంగా అన్పించింది శారదకు. అందుకే పద్మను తీసుకుని ఒక రాత్రికి రాత్రే బయల్దేరి ఇంత దూరాన వచ్చిపడింది. భర్త తాలూకు పెన్షను వస్తుంది. తానేమో కుట్లుకుడుతుంది. ఆ ఆదాయం చాలు ఇద్దరి ప్రాణాలకి. తమ గురించిన ప్రసక్తి ఇక్కడ ఎవరికీ అవసరం లేదు

ఆ అవకాశం తామివ్వలేదు కూడా- తనే గనుక లోకుల సానుభూతి కొరకు ఆరాటపడి ఏమైనా ఇంత బయట పడినట్టయితేనా .... ఈసరికి సుగుణ తల్లికి మల్లే నే ఇక్కడి ఆంటీలకూ వీలయితే అంకుల్స్‌కి కూడా ఒక టాపిక్ అయి కూచునేది.

'టాపిక్ ... !!'

ఈ 'టాపిక్'కి ఒక తుదీ మొదలూ ఉండదు. ఎవ్వరూ ఏ రకపు సహాయానికీ ముందుకి రాకపోగా - లొల్లి బొల్లి ఖబుర్లతో కడుపు నింపి ఆ వెనుక అవహేళనగా నవ్వుకోడానికి పనికి వస్తుంది. పర్యవసానం....? లేనిపోని కట్టు కథలూ, విమర్శలూ.

సుగుణతల్లిని తల్చుకుని అయ్యో పాపం అనుకుంది శారద.

ఆ తరువాత అంతటితో ఊరుకోలేక పోయింది.

సుగుణను పిలిచి ....'చూడమ్మా.... సుగుణా! కన్నతల్లి పోయాక ఆ తల్లి స్థానంలోనికి వచ్చే ఏ స్త్రీ అయినా ఒక గట్టి నిర్ణయం తీసుకునే వస్తుందమ్మా. ఆ నిర్ణయం సత్ఫలితాన్ని ఇచ్చేదే అయి వుంటుంది. మూడు ముళ్ళూ వేయించు కుంటూనే నీకు తల్లిలేని లోటును భర్తీ చేస్తూ, ఆమె నిన్ను సవ్యంగా పెంచి పెద్ద చేసే బాధ్యతను స్వీకరిస్తుందన్న మాట.

పెళ్ళిపీటమీదికి ఎక్కే ప్రతి స్త్రీ ఏమని ప్రమాణం చేస్తుందో తెలుసా? ఇహమీదట తాను నిర్వర్తించవలసిన సాంసారిక విధులను తు.చ. తప్పకుండా పాటిస్తానంటూ పెద్దలందరి సమక్షంలో ఒప్పందం పడుతుంది. అయితే సంతానం కలిగివున్న రెండో పెళ్ళివాణ్ణి చేసుకునే స్త్రీకి ఇదొక ఎడిషనల్ ఛార్జి లాంటిది.

ఇది చాలా దీక్షతో కూడిన గురుతర మయిన బాధ్యత. ఇది కూడా ఒక సాంఘిక సమస్య లాంటిదే. ఒక్కొక్క ప్పుడు ఈ పిల్లలు తమ సవతి తల్లికి ఎదురుతిరుగుతారు. ఆమెను ఖాతరు చెయ్యరు. ఇంకో సందర్భంలో ఈ తల్లే ఆ పిల్లల్ని అర్థంచేసుకోలేక భర్తతో ఏకమై ఫిర్యాదులకు దిగడం జరుగు తుంది.

అతడు గట్టివాడైతే ఫర్వాలేదు!

ఈ విధంగా ఒకరికొకరు ఎడ్జెస్ట్ అవడం ఒకరినొకరు అండర్‌స్టాండ్ చేసుకోవడమనేది ఒక త మా షా పీరియడు. ఈ టైమ్‌లోనే ఈ వినోదాన్ని చూడాలని ఇరుగూపొరుగూ ఉబలాట పడుతుంటారు. అప్పుడే మనం జాగ్రత్త వహించాలి. వాళ్ళకి దొరికిపోయామో.... మనల్ని కోతుల్ని చేసి ఆడించడానికి ఏమాత్రం వెనుకాడరు.

ప్రస్తుతం నీ అలనాపాలనా చూపే ఆంటీలంతా అటువంటివారే. నువ్వు వాళ్ళ ట్రాప్‌లో ఈజీగా పడిపోయావు. ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. నీ తల్లి కూడా అందరి తల్లుల్లాంటిదే. ఆమెలో తప్పు పట్టవలసిన అవలక్షణా లేమీ లేవు. నువ్వు ఏ విధంగా తల్లిలేని లోటును ఫీలవుతున్నావో అదే విధంగా తన భర్తకు తొలిభార్యగా తాను లేక పోయినందుకూ, నీలాంటి ముద్దులపట్టిని కని అతని సంపూర్ణ ప్రేమను పొంద



లేకపోయినందుకూ....నీ తల్లీ ఫీలవుతూ వుండొచ్చునుగా –' అంటూ చెప్పా లనుకుంది.

ఆమాత్రం అర్థంచేసుకోగలిగిన శక్తి సుగుణ కుంది. ఎవరేది చెప్పినా తేలిగ్గా నమ్మేసే వయసులో వుంది సుగుణ.

ఇప్పుడు శారద మనసుకి కొంచెం భారం తగ్గినట్టయింది.

'పద్మ ఏంచేస్తున్నదో' అనుకుంటూ ఆమె మంచం దిగి ఇటుగా వచ్చింది.

చింకిచాపమీద పుస్తకాలు ముందు వేసుకుని కునికిపాట్లు పడుతున్న పద్మ ఆమె కంటబడింది. 'అయ్యో....అన్నమైనా అడక్కుండా....ఇలాగ...' తప్పు చేసినదానికిమల్లే చింతిస్తూ శారద పద్మను మృదువుగా తట్టి లేపి తూలుతున్న ఆ పిల్లను జాగ్రత్తగా చెయి పుచ్చుకు నడిపించుకుంటూ వంటపాత్ర లున్న తావుకు తీసుకుపోయింది.

రెండు ముద్దలు తినడం పూర్తయాక

కాని పద్మకు మగత వదల్లేదు. ఈలోగా శారద పక్క దులిపివేసి పద్మకు పడక సిద్ధంచేసింది. మరో అర్ధగంట తర్వాత అన్నీ సర్ది పెట్టి....నిద్రపోతున్న పద్మను గుండెలకు సమీపంగా లాక్కుంటూ అదే దిండుమీద పద్మ తలతో తన తలను చేర్చి శారదమ్మ కూడా నిద్రకొరిగింది.

* * *

వారంరోజులు పోయాక ఒకనాడు సుగుణ వచ్చింది. "పద్మా.....!" అని పిలుచుకుంటూ.

"రావమ్మా రా....!! ఆరోజు తర్వాత మళ్ళీ కన్పించలేదేం...??" అంటూ శారద ప్రసన్నంగా నవ్వుతూ ప్రశ్నించింది.

"నేను సరిగా చదవడంలేదని ప్రైవేటు మాస్టార్ని పెట్టించింది మా అమ్మ. అందుకని నేను ఇదివరకటిలా తిరగలేకపోతున్నానండీ....ఇవ్వాళ మా సార్ రాలేదు. అందుకే...."

"మంచిదేగా! బాగా చదువుకోవాలి మరి నువ్వు...."

"ఎందుకండీ! ఎంత కష్టపడి చదివినా మళ్ళీ పెళ్ళిచేస్తారు కదా! ఉద్యోగాలు చేసేవాళ్ళకయితే ఇలాంటి గట్టి చదువులు గాని, ఒక మొగుడిచాటున బ్రతకాల్సిన ఆడపిల్లలకి ఈ చదువు లెందుకు చెప్పండి....ఆమె పంతం కాకపోతే."

శారద పెదాలమీది నవ్వు చెరిపేసి నట్టే మాయమయింది. ఆమె మొహం తెల్లగా పాలిపోయింది. సుగుణ మెడ చుట్టూ స్నేహంగా చేతిని చుట్టి, తయారుగా వాల్చివున్న మడతమంచం మీద కూచోబెడుతూ....

"సుగుణా....ఎవరమ్మా నీకీ మాటలు నేర్పింది....?" అంటూ లాలనగా అడిగింది.

"ఎవరైతేనేం లెండి—నామీద అభిమానమున్నవాళ్ళంతా నా గురించే ఆలోచిస్తుంటారు ఎప్పుడూ...."

"అంటే మీ ఝాన్సీ, సుమిత్ర అంటీలు....అవునా....?"

"ఊఁ...."

"అభిమానం అంటే నీకు ఉపకరించే విషయాల్లో ఇలా అడ్డుమాటలు చెప్పడమూ అభిమానమేనా....?"

ఆ పిల్ల తలాడిస్తూ, "ఏ విషయమైనా నాకు ఇష్టమంటూ ఉండాలి కదండీ. వాళ్ళ ఇష్టాలన్నీ నామీద రుద్ది...."

ఆపైన సుగుణ మాట పూర్తిచెయ్యనీలేదు శారద.

"నువ్వెళ్ళి ఆ తలుపు వేసేసిరా....!" అంది ఆజ్ఞాపిస్తున్నట్టు.

"ఎందుకండీ....పద్మ లేదా? ఎక్కడికెళ్ళింది....??" అంటూనే సుగుణ అయిష్టంగా లేచి తలుపువేసి వచ్చింది.

ఆపిల్ల మనసు 'పోదాం....పోదాం' అంటూ ఎదురుతిరిగింది.

"పద్మను పిండిమిల్లుకి పంపించాను. ఇదిగో వచ్చేస్తుంది....ఒక్క సంగతి—"

"అబ్బా! మీదంతా అదో వ్యతిరేకం.

మా అమ్మని సపోర్ట్ చేసేవాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను....." సుగుణ నోట్లోంచి విసుగ్గా వచ్చినయి ఆ మాటలు. శారద చలించకుండా గంభీరంగా "చూడమ్మా! నువ్వు చదువుకోవడం కేవలం నీకోసమే ఆమెకోసం కాదు. ఇందులో ఆమె స్వార్థం ఏమీ లేదు. చదువు విషయంలో 'వత్తిడి' అనేది లేకపోతే ఎవరికీ పుస్తకాలు పట్టుకు కూచోవా లనిపించదు....

విద్య చెప్పించడంలోనే ఒక సిస్టమ్ వుంది. ఆ సిస్టమ్ నేర్పడంలోనూ, నేర్చుకోడంలో గూడా కనిపిస్తుంది. 'చదవండి....చదవండి' అనే హెచ్చరికలో 'బాగుపడండి .... బాగుపడండి' అనే ఆశీర్వచనం నిగూఢంగా దాగి వుందమ్మా! ఇప్పుడు చెప్పు....నిన్ను చదువుకోవద్దని చెప్పేవాళ్ళంతా నీ బాగోగుల గురించి ఆలోచించే చెబుతున్నారంటావా...."

సుగుణ ఆశ్చర్యంతో శారద ముఖాన్ని రెప్పవెయ్యకుండా చూడ సాగింది.

"మీ అమ్మ నీ భవిష్యత్తును గురించి కమ్మని కలలు కంటోందమ్మా! అందరిలో నువ్వు ఆరోగ్యంగా, అందంగా, తెలివిగా, దర్జాగా బ్రతకాలని ఆమె ప్రగాఢమైన కోరిక....ప్రతి తల్లీ తన బిడ్డ గురించి ఇలాగే కోరుతుంటుంది—"

సుగుణ ముఖంలో ఏదో మార్పు. 'అవును గాబోలు - మా అమ్మ అందరి అమ్మలకు మల్లే.... నిజమేనేమో .... సుమిత్ర, రూప్సీ, విశాల ఆంటీలు నాకైతే ఇటువంటి అడ్డుమాటలు చెప్పారు: మరి వాళ్ళంతా తమ పిల్లల్ని పోటీలు పడి చదివిస్తున్నారేం....?' సుగుణకు ఉక్రోషం వచ్చింది.

ఆ పిల్ల చిన్నిమనసుకి ఇదొక అవమానంగా అనిపించింది. ఇన్నాళ్ళుగా తాను ఏటువంటి విషప్రపంచంలో బ్రతికిందీ అర్థమైంది — 'ఇహమీదట తాను కష్టపడి చదివి తన తల్లిని సంతోష పెట్టడమే ఆమెకు చూపించే కృతజ్ఞత' అనుకుంది.

శారద ఆమె చర్యలను గమనిస్తూ వుంది. 'ఏ చెట్టు నీడ ఆ చెట్టుకే' అని తెల్పింది. ఇంకా అదను కనిపెట్టి తన మృదువచనాలతో ఆ లేతహృదయాన నాటిన అపోహల బాణాల నన్నింటినీ పెరికివేసింది - సుగుణ కళ్ళల్లో సుళ్ళు సుళ్ళుగా తిరిగే కన్నీటి ప్రవాహాన్ని ఆప్యాయంగా చీర చెరుగుతో వత్తి సముదాయించింది. ఇంతలో తలుపు చప్పుడయింది.

"అదుగో....మా పద్మ కూడా వచ్చేసినట్టుంది. ఇక వెళ్ళి ఆడుకోండమ్మా కాస్సేపు; మళ్ళీ పొద్దు కూకింతర్వాత చదువుకుందురుగాని.." అంటూ పద్మకు ఎదురేగి పిండిడబ్బా అందుకని, అది

జల్లించుకోవాలంటూ ఆమె లోపలికి వెళ్ళింది.

* * *

ఇప్పుడు సుగుణ రోజూ సాయంత్రం ప్రైవేటు అయాక తన తండ్రితో వంతెనదాకా వాకింగ్‌కి వెళ్తున్నది. అప్పుడప్పుడూ తల్లితో ఆంజనేయుడి గుడికి వెళ్తొస్తున్నది.

ఈ మార్పుకి కారణం తెలీక అయోమయంలో పడిన ఆంటీలంతా గుంటనక్కల్లా కిటికీ చువ్వల్లోంచి తమ వంక నిక్కి-నిక్కి చూడ్డాన్ని ఆ పిల్ల గమనించక పోలేదు.

ఒకరోజున పద్మ తల దువ్వించుకుంటూ తల్లితో....

"అమ్మా ...! విన్న సుగుణమణి ఏమందో తెలుసా; నీకు మల్లె నే వాళ్ళమ్మ కూడా చాలా మంచిదట. ఇన్నాళ్ళకి నా ఎదుట ఒప్పేసుకుంది_" అంటూ ఆనందంగా నవ్వింది.

శారద మాత్రం నవ్వలేదు. ఆమె మనస్సులోపలే....

'సుగుణతల్లి అదృష్టవంతురాలు పద్మా! రెండో పెళ్ళివాణ్ణి చేసుకున్నందుకు ధైర్యంగా, సంఘంమీద సవాలు చేస్తున్నట్టే, సవతి బిడ్డకు తగిన 'మంచి అమ్మ'గా తన పాత్రను నిలబెట్టుకోగల్గింది. అదేవిధంగా రెండో పెళ్ళివాణ్ని చేసుకున్న నేను, సమాజానికి జడిసి పారిపోయి ఈ విధంగా పిరికిజీవితం గడుపుతున్నాను. నీ తండ్రి కోరిక ప్రకారం నీ కన్నతల్లిని నేను కాదనే విషయాన్ని నీకు కూడా తెలియకుండా నిన్ను మభ్యపెట్టాను,' అనుకుంటూండగా....రిబ్బను ముడివేస్తున్న ఆమె చేతులు సన్నగా వొణికినాయి—

కళ్ళ అంచుల్ని ఒడుచుకు వచ్చిన కన్నీటిబొట్లు తలలో తురుముతున్న పూలచెండులో టపాటపా రాలపడినయి.